సాక్షి
తూర్పుగోదావరి

గురువారం | 18 | సెప్టెంబర్ | 2025



కేజీ వెండి సమర్పణ

నిడదవోలు గణేష్ చౌక్ సెంటర్లో వేంచేసిన పూజా గణపతి, కుమారస్వామి వార్లకు బుధవారం ప్రముఖ వ్యాపారవేత్త రొంగలి సరోజని స్వామివారికి కేజీ వెండి సమర్పించారు.




వెంకన్న ఆదాయం రూ.1.49 కోట్లు

వాడపల్లి శ్రీ, భూ సమేత వెంకటేశ్వరస్వామి వారి హుండీల ద్వారా రూ.1,49,21,278 ఆదాయం వచ్చినట్టు ఈఓ నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు.

-8లో

4.10 లక్షల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం రాత్రి 4,10,096 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. డెల్టా కాలువలకు 9,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భద్రాచలంలో 35.70అడుగులకు నీటి మట్టం చేరింది.

అక్షరమే ఆయుధం

పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు



మీడియాపై అక్రమ కేసులు పెట్టడం అంటే ఈ కూటమి ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు బిగిస్తున్నట్లే. పోలీసుల పదోన్నతుల్లో జరుగుతున్న అన్యాయంపై 'సాక్షి'లో కథనం రాస్తే పోలీసులు స్వాగతించాల్సింది పోయి, కూటమి ప్రభుత్వ పెద్దలు చెప్పినట్లు ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డిపై కేసులు పెట్టడం దారుణం. రాసిన కథనాల్లో ఏమైనా ఇబ్బందులు, సమస్యలు ఉంటే వివరణ ఇవ్వాలే తప్ప ఇలా అక్రమ కేసులు బనాయించి వేధించడం సరికాదు.

– రేవు తిరుపతిరావు, పీడీఎస్‌యూ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, అమలాపురం

కక్ష సాధింపు చర్యలు



సాక్షి పత్రిక ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డిపై వరుసగా పోలీసు కేసులు పెట్టిస్తూ కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. ఈ ఘటనలు చూస్తుంటే అసలు మనం ప్రజాస్వామ్యంలోనే ఉన్నామా అనే అనుమానం కలుగుతోంది. ప్రజల పక్షాన వార్తలు రాస్తున్న సాక్షి పత్రికను టార్గెట్ చేసి, దాని ఎడిటర్‌ను వేధించడమంటే పత్రికా స్వేచ్ఛను, వాక్ స్వాతంత్ర్యాన్ని ఈ కూటమి ప్రభుత్వం హరిస్తున్నట్లే.

– కుడుపూడి సూర్యనారాయణరావు, ఎమ్మెల్సీ, అమలాపురం

న్యూస్‌రీల్

పని ఒత్తిడి తగ్గించాలి



కలెక్టర్‌కు నోటీసులు అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల పని ఒత్తిడిని తగ్గించాలని, గతంలో వలంటీర్లు చేసిన విధుల నుంచి తమని తప్పించాలని డిమాండ్లతో సచివాలయ ఉద్యోగులు అక్టోబర్ ఒకటో తేదీ నుంచి సమ్మె బాట పట్టనున్నారు. ఈ కార్యాచరణ కోసం బుధవారం సచివాలయ ఉద్యోగులు కలెక్టరేట్‌లో కలెక్టర్ కీర్తి చేకూరిని కలసి తమ కార్యాచరణ ముందస్తు నోటీసును అందజేశారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక పిలుపు మేరకు తూర్పుగోదావరి జిల్లా ఐక్యవేదిక తరపున జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరికి అందజేశామని ఉభయగోదావరి జిల్లాల గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ కోఆర్డినేటర్ దదాల జగ్గారావు అన్నారు. కార్యక్రమంలో కొల్లి రాజేష్, కాశీ విశ్వనాథ్, నాయుడు, రామాంజనేయులు, రామదాసు సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఏడీగా రామచంద్రరావు బాధ్యతలు స్వీకరణ



సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఏలూరు జిల్లా పౌర సంబంధాల అధికారిగా పని చేస్తున్న ఆర్‌వీఎస్ రామచంద్రరావు పదోన్నతిపై బుధవారం రాజమహేంద్రవరం రాష్ట్ర సమాచార కేంద్రం సహాయ సంచాలకుడిగా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహించిన ఎం.లక్ష్మణాచార్యులు నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.లక్ష్మీనారాయణ అభినందనలు తెలియజేశారు. కార్యాలయ సిబ్బంది వర్మ, ఆనంద్, పలువురు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎన్‌డీపీఎస్ కేసులపై అవగాహన అవసరం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఈగల్ సెంట్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో భాగంగా జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పోలీసులు, రైటర్లు, అసిస్టెంట్ రైటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు ఎన్‌డీపీఎస్ కేసుల పూర్తి ఇన్వెస్టిగేషన్ ప్రొసీజర్‌పై జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కేసుల్లో సమాచారం వచ్చినప్పటి నుంచి చార్జ్‌షీట్ దాఖలు చేసేంత వరకు సమాచారం ఏ విధంగా రికార్డు చేయాలి, ప్రాపర్టీని ఏ విధంగా సీజ్ చేయాలి, ఎలా సీల్ చేయాలి, మేజిస్ట్రేట్ వద్ద ఇన్వెంటరీని సర్టిఫై చేయించే విధానం వంటి పలు అంశాలపై పూర్తి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎంబీఎస్ మురళీకృష్ణ, ఏవీ సుబ్బరాజు, యల్.అర్జున్, ఎస్బీ డీఎస్పీ బి.రామకృష్ణ, ఇతర అధికారులు, ఈగల్ సిబ్బంది పాల్గొన్నారు.

రత్నగిరిపై ఏకాదశి పూజలు



సత్యదేవుని దర్శనానికి క్యూ లో నిల్చున్న భక్తులు

అన్నవరం: రత్నగిరి వీర వేంకట సత్యనారాయణ స్వామివారికి భాద్రపద బహుళ ఏకాదశి పర్వదినం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఏడు గంటలకు స్వామి, అమ్మవార్లకు స్వర్ణపుష్పాలతో అర్చన చేశారు. అనంతరం ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకు పుష్పార్చన, అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రసాదాలు నివేదించి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి, అర్చకులు వేంకటేశ్వర్లు, పరిచారకులు యడవిల్లి ప్రసాద్, కొండవీటి రాజా తదితరులు ఈ పూజలు నిర్వహించారు. సుమారు 20 వేల మంది భక్తులు స్వామివారి సన్నిధికి రావడంతో క్యూలైన్లు, వ్రత మండపాలు, ఆలయ ప్రాంగణం భక్తులతో నిండిపోయాయి. సత్యదేవుని దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట సమయం పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో శ్రీకృష్ణుడు, గోవులకు ప్రదక్షిణ చేశారు. స్వామివారి వ్రతాలు 1,200 నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.20 లక్షలు ఆదాయం సమకూరింది. ఐదు వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

రాజకీయ సంగ్రామం

- స్థానిక సంస్థల ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్
- నిర్వహణకు సిద్ధం కావాలంటూ అధికారులకు ఆదేశాలు
- రిజర్వేషన్లపై మల్లగుల్లాలు
- గ్రామీణ ప్రాంతాల్లో వేడెక్కుతున్న రాజకీయం
- అభ్యర్థుల సంతానం, అర్హతపై సందిగ్ధం
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ల వద్దకు పరుగులు



నిడదవోలు మండలం పెండ్యాల గ్రామం

సాక్షి, రాజమహేంద్రవరం: స్థానిక సంస్థల ఎన్నికలకు ఎన్నికల కమిషన్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 2026 జనవరి నెలలో ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టాలని ఇటీవల అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 2021లో ఎన్నికలు జరిగాయి. వాటి పదవీకాలం 2026 ఏప్రిల్ నెలతో ముగియనుంది. ఇదిలా ఉంటే ముందస్తుగానే ఎన్నికలు నిర్వహించేందుకు ఎలక్షన్ కమిషన్ రంగం సిద్ధం చేస్తోంది. ఎన్నికల కమిషన్ ప్రకటనతో గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయం వేడెక్కింది. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీలుగా బరిలోకి దిగేందుకు ఆసక్తి చూపుతున్న నేతల్లో ఉత్సాహం నెలకొంది. తమకు అభ్యర్థిత్వం ఖరారు చేయాలంటూ ఆయా పార్టీల నేతలను ఆశ్రయిస్తున్నారు. మరో వైపు ఓటర్ల జాబితా రూపొందించడం, పోలింగ్ కేంద్రాలు, రిజర్వేషన్ల ఖరారు లాంటి అంశాలపై అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఇదిలా ఉంటే.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు బిడ్డల కన్నా మించి ఉంటే పోటీకి అనర్హులవుతారని, ఆ విధంగా చట్టం తెస్తామని సీఎం చంద్రబాబు ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై నేతల్లో అంతర్మథనం నెలకొంది. అదే జరిగితే తాము పోటీ నుంచి తప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్న మీమాంస నెలకొంది.

గ్రామీణ ప్రాంతాల్లో గరం గరం

స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా ఒక్కసారిగా గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయం వేడెక్కుతోంది. ఏ గ్రామంలో చూసినా.. ఏ సెంటర్‌లో విన్నా ఎన్నికల చర్చే నడుస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సూపర్‌సిక్స్ పథకాలు సక్రమంగా అమలు చేయకపోవడంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అన్ని వర్గాల నుంచి ఛీత్కారాలు తప్పడం లేదు. సంపద సృష్టి పేరుతో విచ్చలవిడిగా మద్యం విక్రయాలకు దిగడం, బెల్ట్ షాపులు నడపడంతో ప్రజల నుంచి విమర్శలు ఎదురవుతున్నాయి. రైతులకు అత్యవసరమైన ఎరువులు, యూరియా అవసరమైన మేరకు అందించడంతో ఘోరంగా విఫలమైంది. వెరసి రైతులు యూరియా కోసం తిప్పలు తప్పడం లేదు. దీంతో టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఉత్సాహం చూపడం లేదు. ప్రజా సమస్యల పరిష్కారానికి వైఎస్సార్ సీపీ ఆందోళనలు తీవ్రం చేయడం.. ప్రజల పక్షాన నిలబడటంతో ప్రజలు వైఎస్సార్ సీపీ వైపు మొగ్గుచూపుతున్నారు.

రిజర్వేషన్లపై ఉత్కంఠ

స్థానిక ఎన్నికల దృష్ట్యా వార్డు రిజర్వేషన్లపై ఉత్కంఠ నెలకొంది. తమ గ్రామాల్లో ఏ వార్డు ఏ రిజర్వేషన్ వస్తుందో..? అన్న విషయమై పార్టీల నేతలు సమాలోచనలు చేస్తున్నారు. తమకు అనుకూలంగా వస్తే ఓకే.. లేదంటే ఆ స్థానంలో ఎవరిని నిలబెట్టాలి..? వారి గెలుపునకు ఎలా కృషి చేయాలన్న లెక్కలు వేసుకుంటున్నారు.

ఉమ్మడి తూర్పులో ఇలా..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ డివిజన్లు 7, మండలాలు 64, మండల ప్రజా పరిషత్తులు 57, పంచాయతీలు 1,012, మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు 9, పట్టణాలు 14, గ్రామాలు 1379 వున్నాయి. మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీ, సర్పంచ్ తదితర ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం సన్నద్ధమవుతోంది.

ఇదీ సంగతి..

2018లో స్థానిక సంస్థల ఎన్నికలు (గ్రామ పంచాయతీలు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు) జరగాల్సి ఉండగా.. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అప్పటి ప్రభుత్వం వాయిదా వేసింది. 2021లో గ్రామ పంచాయతీలకు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు, పురపాలక సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. వాటి కాల పరిమితి రెండు నెలలు అటు.. ఇటు.. 2026 ఏప్రిల్ నెలతో ముగియనుంది.

షెడ్యూల్ ఇలా..

రాష్ట్ర ఎన్నికల కమిషన్ స్థానిక సంస్థల ఎన్నికలపై పంచాయతీరాజ్, మున్సిపల్ అధికారులకు లేఖ పంపింది. లేఖ ప్రకారం షెడ్యూల్ పరిశీలిస్తే...

- **అక్టోబర్ 15:** వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలి
- **అక్టోబర్ 16 నుంచి నవంబర్ 15:** వార్డుల వారీగా ఓటర్ల జాబితా రూపకల్పన
- **నవంబర్ 1 నుంచి 15:** ఎన్నికల అధికారుల నియామక ప్రక్రియ
- **నవంబర్ 16:** పోలింగ్ కేంద్రాలు, ఈవీఎంలు సిద్ధంగా ఉంచాలి
- **డిసెంబర్ 15:** వార్డులు, మున్సిపల్ చైర్మన్లు, ఎంపీపీ, సర్పంచ్ స్థానాలకు రిజర్వేషన్లు వెల్లడించాలి.
- డిసెంబర్ నెల చివరిలో రాజకీయ పార్టీల నేతలతో సమావేశాలు ఏర్పాటు చేయాలి.
- **2026:** జనవరి నెలలో ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చి, ఎన్నికలు నిర్వహించాలి. ఫలితాలు సైతం వెల్లడించాలి.

అర్హతపై ఆందోళన

స్థానిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి అర్హత విషయంలో గందరగోళం నెలకొంది. దేశంలో అధిక జనాభా కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్న తరుణంలో «ఇద్దరు ముద్దు.. ముగ్గురు వద్దు» అనే నినాదం మారుమోగింది. ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలుంటే ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులన్న చట్టం తీసుకొచ్చింది. మగవాళ్లకు వేసక్టమీ శస్త్రచికిత్సలను సైతం ప్రోత్సహించారు. ఇద్దరు పిల్లలుంటే మంచిదన్న ప్రచారం విస్తృతం చేశారు. దీంతో చాలా మంది ఇద్దరు పిల్లలతోనే సరిపెట్టుకున్నారు. తాజా పరిణామాలు అందుకు భిన్నంగా మారుతున్నాయి. ప్రపంచ జనాభా తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో అధిక జనాభా దేశానికి శక్తి అంటూ సీఎం చంద్రబాబు నినాదంగా పెట్టుకున్నారు. ప్రతి సమావేశంలోనూ పిల్లలను కనండంటూ ప్రసంగాలు చేస్తున్నారు. స్థానిక సంస్థల్లో పోటీ చేయాలంటే ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ మంది ఉండాలన్న నిబంధన తీసుకొస్తామని స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. అదే జరిగితే ఇద్దరు పిల్లలున్న వారంతా పోటీకి దూరమవుతారు. ఈ పరిణామం పోటీదారుల్లో ఆందోళనకు గురిచేస్తోంది.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ దారుణం

- రేపు చలో మెడికల్ కాలేజ్
- కూటమి ప్రభుత్వ పీపీపీ విధానంపై వ్యతిరేక ఉద్యమం
- సీఎం చంద్రబాబు, పవన్, లోకేష్ ఈగోలకు పోవద్దు
- వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా ధ్వజం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జక్కంపూడి రాజా

సాక్షి, రాజమహేంద్రవరం: కూటమి ప్రభుత్వం వైద్య విద్యను వ్యాపారంగా చేయాలని చూడటం దారుణమని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. వైద్య కళాశాలల్లో కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన పీపీపీ (ప్రైవేటీకరణ) విధానాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో శుక్రవారం 'చలో మెడికల్ కాలేజ్' పేరుతో ఆందోళనకు శ్రీకారం చుట్టామని ప్రకాశ్‌నగర్‌లోని తన నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో కళాశాలలు వచ్చాయని, వాటిని కొనసాగిస్తే ఆ క్రెడిట్ గత సీఎం జగన్‌కు వెళ్తుందన్న ఉద్దేశంతో ప్రైవేటీకరణకు దిగడం దారుణమన్నారు. ఈ విషయమై సీఎం చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేష్ వ్యక్తిగత ఈగోలు పక్కనపెట్టి ప్రైవేటీకరణ ఆలోచనను విరమించాలని కోరారు. ఎన్నికలకు ముందు సంపద సృష్టిస్తానని నేడు ఆస్తులు ప్రైవేటీకరిస్తున్నారని పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో 835 ఎకరాల భూసేకరణ

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా వైద్య కళాశాలల కోసం 835 ఎకరాల భూ సేకరణ చేశామన్నారు. విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, నంద్యాల, మచిలీపట్నం ప్రాంతాల్లో కళాశాలల నిర్మాణం పూర్తయింది. 750 సీట్లతో తరగతులు ప్రారంభించామన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం బకాయిలున్నాయని, అందుకే నిర్మాణాలు చేయలేకపోతున్నామని అబద్ధాలు చెబుతోందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలోనే ఎలాంటి బకాయిలు లేవన్నారు. రూ.8,840 కోట్లతో పరిపాలనా అనుమతులు తెచ్చినట్లు వివరించారు. నాబార్డు నిధులు సైతం మంజూరయ్యాయన్నారు. గత ప్రభుత్వం దిగిపోయే నాటికే కాలేజీల నిర్మాణం వివిధ దశల్లో ఉందన్నారు. టీడీపీ పుట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎప్పుడైనా ఒక్క వైద్య కళాశాలైనా తెచ్చిందా అని ప్రశ్నించారు.

వైద్య కళాశాలల్లో సౌకర్యాలు కల్పించలేమని చంద్రబాబు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయడం దుర్మార్గపు చర్యగా అభివర్ణించారు. ఇలాంటి చర్యలు మానుకోకపోతే కూటమి నేతలను, ఎమ్మెల్యేలను స్థానిక ప్రజలు తరిమికొడతారన్నారు. విద్య, వైద్యం, పేద విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు నాడు దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి, నేడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. శాసనసభ సమావేశాల్లో కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని మార్చుకోవాలని హితవు పలికారు.

ఉద్యోగుల బకాయిలను తక్షణమే చెల్లించాలి

- ఎమ్మెల్సీ గోపిమూర్తి
- 25న విజయవాడలో రణభేరి



రణభేరి పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): పాఠశాల విద్యారంగ సమస్యలపై ఈ నెల 25న విజయవాడలో యూటీఎఫ్ నిర్వహిస్తున్న రణభేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి కోరారు. గోకవరంలో 300 మంది యూటీఎఫ్ కార్యకర్తలతో ప్రారంభమైన బైక్ జాతా రాజమహేంద్రవరం చేరింది. స్థానిక కోరుకొండ రోడ్డులోనున్న యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆయన బుధవారం మాట్లాడుతూ తక్షణమే పీఆర్సీ కమిటీని ప్రకటించి ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావలసిన సుమారు రూ.20 వేల కోట్ల బకాయిను వెంటనే చెల్లించాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు కావస్తున్నా ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఉపాధ్యాయులపై యాప్‌ల భారం పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశక్తి కార్యక్రమాలు, పరీక్షల మూల్యాంకనాలు, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్, గ్రీన్ పాస్‌పోర్ట్ మొదలైన బోధనేతర కార్యక్రమాలతో ఉపాధ్యాయులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారన్నారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో రణభేరి కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు ఈ సమస్యలపై ఎలుగెత్తి చెబుతున్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను కూడా చెల్లించాలన్నారు. ఈనెల 18 నుంచి జరిగే శాసనమండలి సమావేశాల్లో ఈ సమస్యలపై చర్చిస్తానన్నారు. రాష్ట్ర కార్యదర్శిఎస్.అరుణకుమారి మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే పీఆర్సీ వేయాలన్నారు. అలాగే మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. బైక్ జాతా కడియం మీదుగా కోనసీమ జిల్లా మండపేటకు వెళ్లింది. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు జ్యోతిబసు, టి.చక్రవర్తి, వివిధ జిల్లాల కార్యదర్శులు చిలుకూరి శ్రీనివాసరావు, కే.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

రాజమహేంద్రవరం సిటీ: 2027లో మహా గోదావరి పుష్కర పనులు, నగరాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించినట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ అధికారులను ఆదేశించారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామకృష్ణ, ముప్పిడి వెంకటేశ్వరరావు, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ ఆర్ఎంసీ పరిధిలో చేపడుతున్న, ప్రతిపాదించిన పుష్కర పనులపై ట్రాఫిక్ మళ్లింపు, రవాణా, ఘాట్ల అభివృద్ధి, తదితర అంశాలపై రూపొందించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌పై సమగ్రంగా చర్చించారు. అక్టోబర్ మొదటి వారంలో రాష్ట్ర ముఖ్యమంత్రి సమక్షంలో గోదావరి పుష్కరాలు కోసం రూపొందించిన అంశాలు, నిధుల కేటాయింపులపై సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి శాఖ ఆధ్వర్యంలో డీపీఆర్ సిద్ధం చేయాలని అధికారుల్ని ఆదేశించారు. రహదారులు, డ్రైనేజీ పనులను వేగంగా పూర్తి చేసి, పంచాయతీలకు వచ్చే ఆదాయాన్ని అదే పంచాయతీ అభివృద్ధి పనులకు ఖర్చు చేయాలని సూచించారు. రాబోయే పుష్కరాల దృష్ట్యా రూ.456 కోట్లతో రహదారులు, డ్రైన్ల పనులు చేపట్టనున్నామని వివరించారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ 2027 పుష్కరాల దృష్ట్యా క్రౌడ్ మేనేజ్‌మెంట్, ఘాట్ల అభివృద్ధి, ట్రాఫిక్ మళ్లింపు, రహదారుల అభివృద్ధి వంటి అంశాలపై రూపొందించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌పై సమావేశంలో చర్చించామని వెల్లడించారు. సమావేశంలో ఆర్ఎంసీ అధికారులు, రుడా అధికారులు పాల్గొన్నారు.

బార్లకు నేడు లాటరీ



రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరంలోని ఆర్డీవో కార్యాలయంలో గురువారం ఉదయం 8 గంటలకు రెండో విడత బార్లకు లాటరీ తీయనున్నట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి చింతాడ లావణ్య తెలిపారు. జిల్లాలో మిగిలిన 16 బార్లకు గాను బుధవారం రాత్రి 9 గంటల వరకు 32 దరఖాస్తులు మాత్రమే రావడం జరిగిందన్నారు. నాలుగు దరఖాస్తులు వచ్చిన బార్లకు మాత్రమే లాటరీ తీయడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు 8 బార్లకు మాత్రమే నాలుగు దరఖాస్తులు చొప్పున వచ్చాయన్నారు. అర్ధరాత్రి 11.59 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని ఆమె తెలిపారు. మొదటి విడతలో ఆరు ఓపెన్ కేటగిరీలో, రిజర్వ్ కేటగిరిలో మూడు బార్లకు లాటరీ తీసిన విషయం తెలిసిందే.

స్వచ్ఛతాహీ సేవలో జిల్లాను మేటిగా నిలుపుదాం



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న దగ్గుబాటి పురందేశ్వరి, చిత్రంలో కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం సిటీ: స్వచ్ఛతాహీ సేవ 2025 కార్యక్రమం అమలులో జిల్లాను అగ్రగామిగా నిలుపుదామని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు పిలుపునిచ్చారు. నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి ఆజాద్ చౌక్ వరకు స్వచ్ఛతాహీ సేవా పురస్కరించుకుని బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఎంపీ పురంధరేశ్వరి జెండా ఊపి ప్రారంభించారు. ప్లాస్టిక్ నిషేధం, పరిసరాల పరిశుభ్రత, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, త్రిపుల్ ఆర్ (రెడ్యూస్డ్-రీయూజ్-రీసైకిల్), స్వచ్ఛ భారత్‌పై ప్రజలకు అవగాహన కల్పించేలా ప్లకార్డులను ప్రదర్శించారు. ఎంపీ పురంధేశ్వరి మాట్లాడుతూ సెప్టెంబర్ 17 నుంచి దేశవ్యాప్తంగా 15 రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా ఈ రోజు ఘనంగా ప్రారంభమై అక్టోబరు 2వ తేదీ గాంధీ జయంతితో ముగుస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇల్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అలవాటు చేసుకోవాలన్నారు. కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ శైలజవల్లి, ఎంహెచ్ఓ వినూత్న, సిటీ ప్లానర్ కోటయ్య, మేనేజర్ ఎండీ అబ్దుల్ మాలిక్, రెవెన్యూ ఆఫీసర్ సీహెచ్ శ్రీనివాసరావు, ఇతర అధికారులు, పలువురు ప్రజా ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కుక్కల దాడిలో వృద్ధురాలికి గాయాలు

బిక్కవోలు: మండలంలోని కొమరిపాలెంలోని వాసిరెడ్డి సత్యవతి అనే వృద్ధురాలిపై బుధవారం కుక్కలు దాడి చేశాయి. ఇంటిని శుభ్రంగా చేస్తుండగా వీధి కుక్కలు ఒక్కసారిగా ఆమెపై దాడి చేశాయి. తీవ్రగాయాలు కావడంతో బాధితురాలిని అనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

కరవాకలో గుర్తు తెలియని మృతదేహం

మామిడికుదురు: కరవాక సముద్రతీరంలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. ఆ వ్యక్తి వయసు 30 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉంటుందని నగరం ఎస్సై ఎ.చైతన్యకుమార్ తెలిపారు. మృతుని ఒంటిపై బిస్కెట్ కలర్ పొడవు చేతుల చొక్కాతో పాటు, నలుపు రంగు ఫ్యాంటు ఉందన్నారు. అతని ఎత్తు 5.5 అడుగులు ఉందని చెప్పారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉండటంతో అక్కడే శవ పంచనామా నిర్వహించి, డాక్టర్లు పోస్టుమార్టం నిర్వహించారన్నారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చైతన్య కుమార్ వివరించారు.

క్రీడాపోటీల ఎంపిక వాయిదా

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పాఠశాల క్రీడాసమాఖ్య అండర్-14, 17 ఆధ్వర్యంలో కాకినాడ డీఎస్ఏలో గురువారం జరగాల్సిన వివిధ క్రీడాపోటీల ఎంపికలు వాయిదా వేసినట్లు సమాఖ్య కార్యదర్శులు శ్రీనివాస్, సుధారాణి బుధవారం తెలిపారు. స్విమ్మింగ్, రెజ్లింగ్, స్క్వాష్, మోడ్రన్ పెంటాథ్లాన్, స్కేటింగ్, బీచ్ వాలీబాల్, సైక్లింగ్ ఎంపికలు అండర్-14, 17 బాలబాలికల విభాగంలో వాయిదా పడ్డాయన్నారు. అమరావతిలో 19న 400 మంది పీడీ, పీఈటీలకు డీఎస్సీలో కొత్తగా ఎంపికైన ఉపాధ్యాయుల కార్యక్రమం ఉన్నందున ఎంపికలు వాయిదా వేశామన్నారు.

పోలీసునంటూ బెదిరించి సొమ్ము వసూలు

తాళ్లపూడి: కొవ్వూరు మండలలం గోవర్ధనగిరి మెట్ట వద్ద బుధవారం పోలీసునని చెప్పి ఓ వ్యక్తి సొమ్ము వసూళ్లకు పాల్పడ్డాడు. జియో పెట్రోల్ బంక్ దగ్గరలో ఐషర్ వ్యాన్ డ్రైవర్ ఉదయం నిద్ర వస్తుందని సర్వీస్ రోడ్డులో బండిని పెట్టి నిద్రించాడు. ఈలోపు హోండా షైన్ బైక్‌పై ఓ వ్యక్తి ఎస్సైనని వచ్చి స్టేషన్‌కు పద అని అతడి వద్ద నుంచి రూ.2 వేలు తీసుకొని కొంత తీసుకెళ్లి కొవ్వూరు వైపు వెళ్లిపోయాడు. దీనిపై వ్యాన్ డ్రైవర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్సై శ్రీహరిరావు తెలిపారు.

మందకొడిగా ఈ-క్రాప్

- 1.61 లక్షల ఎకరాల్లో నమోదు
- మారిన నిబంధనలతో వీఏఏల అవస్థలు
- ఈ నెలాఖరు వరకు గడువు
- నమోదు చేసుకుంటేనే ప్రభుత్వ పథకాలు



కొత్తపేటలో పంట నమోదు చేస్తున్న వీఏఏ

కొత్తపేట: ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు నెలలు అవుతోంది. రైతులకు అన్ని విధాలా ఉపయోగకరమైన పంట నమోదు (ఈ-క్రాప్) మాత్రం అనుకున్నట్లు సాగడం లేదు. జిల్లాలో ఈ నెల 15వ తేదీ నాటికి 50 శాతం కూడా పంట నమోదు కాలేదు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో వీఏఏలపై ఒత్తిడి చేస్తున్నారు. వీఏఏలకు పని ఒత్తిడి, గ్రామాలకు కొత్తవారు కావడం, ఎరువుల పంపిణీతో పాటు కొన్ని నిబంధనలు మార్చడంతో అనుకున్నట్లుగా పంట నమోదు జరగడం లేదు. రైతుల మేలు కోసం గత ప్రభుత్వం ఈ-క్రాప్ నమోదు ప్రక్రియకు శ్రీకారం చుట్టిన విషయం విదితమే. పంట నమోదు చేసుకున్న రైతులకు ప్రభుత్వ పథకాలు అన్నింటినీ వర్తింపజేసింది. డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 3,90,708 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నాయి. ప్రధానంగా వరితో పాటు ఉద్యానవన పంటలు అనేకం ఉన్నాయి. వీటన్నింటినీ ఈ నెల 30వ తేదీ లోగా నమోదు చేయాలి. ఇంకా కేవలం 14 రోజులు మాత్రమే సమయం ఉంది. ఈలోగా పూర్తి చేయాలని అధికారులు కింది స్థాయి సిబ్బందిపై ఒత్తిడి చేస్తున్నారు. సకాలంలో పంట నమోదు జరుగుతుందా అన్న అనుమానం వ్యక్తం అవుతోంది. పంట నమోదు సక్రమంగా కాకపోతే పండిన ధాన్యం విక్రయాలకు ఇబ్బందులు వస్తాయి. ఎరువులు సక్రమంగా ఇవ్వకపోగా ధాన్యం విక్రయానికి కూడా ఇబ్బంది కలుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మారిన నిబంధనలతో అవస్థలు

గత ఖరీఫ్ సీజన్‌తో పోలిస్తే ఈ-క్రాప్ నమోదులో ఈ ఏడాది కొన్ని నిబంధనలను ప్రభుత్వం మార్చింది. గతంలో 200 మీటర్ల దూరం నుంచి ఈ-క్రాప్ నమోదుకు అవకాశం ఉండేది. ఇప్పుడు దీనిని 20 మీటర్లకు కుదించారు. విధిగా వీఏఏలు ప్రతి కమతం దగ్గరకు వెళ్లి నమోదు చేయాల్సి వస్తోంది. 25 సెంట్ల లోపు ఉన్న కమతాల్లో ఈ-క్రాప్ నమోదు చేసేందుకు కమతం వద్దకు వెళ్లకపోయినా ఆధార్, పట్టాదారు పాస్ పుస్తకం ఉంటే అయిపోయేది. ఫొటో అప్‌లోడ్ తప్పనిసరిగా ఉండేది కాదు. ఇప్పుడు ఈ ఆప్షన్ తొలగించారు. మరోపక్క యూరియా పంపిణీలో వీఏఏలు బిజీగా ఉండటంతో. ఈ-క్రాప్ అనుకున్నంత ముందుకు సాగడం లేదు. ఈ-క్రాప్ నమోదు బాధ్యత మండల స్థాయిలో మండల వ్యవసాయ అధికారి (ఏఓ)దే. వారు వీఏఏలను సమన్వయం చేసుకుని సకాలంలో ఈ ప్రక్రియను పూర్తి చేయాలి.

ప్రయోజనాలు

ఈ-క్రాప్ నమోదును ప్రతి రైతూ చేయించుకోవాలి. ఇన్‌స్యూరెన్స్ ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల విక్రయానికి, అన్నదాత సుఖీభవ పథకానికి ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి. కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు అందాలన్నా పంట నమోదు చేసుకోవాలి. జిల్లాలోని 22 మండలాల్లో మొత్తం వ్యవసాయ, ఉద్యాన పంటలు 3,90,708 ఎకరాల విస్తీర్ణంలో సాగు అవుతుండగా ఈ నెల 15వ తేదీ నాటికి 1,60,578 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు చేశారు.

త్వరితగతిన పూర్తి చేయాలి



ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను సెప్టెంబర్ 30వ తేదీ నాటికి పూర్తి చేయాల్సి ఉంది. ఆ మేరకు మండల స్థాయి అధికారుల (ఏఓ) పర్యవేక్షణలో గ్రామ స్థాయిలో వీఏఏలు పంట నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశాలిచ్చాం. మారిన నిబంధనలకు అనుగుణంగా వీఏఏలు తమ పరిధిలోని అన్ని పంటలనూ నమోదు చేయాలి. మండల వ్యవసాయాధికారులు ఎప్పటికప్పుడు పంట నమోదు ప్రక్రియపై సమీక్ష చేస్తుండాలి.

– ఎం.వెంకటరామారావు, ఏడీఏ, కొత్తపేట

శరన్నవరాత్ర ఉత్సవాలకు రాట పూజలు



వెదురుపాక పీఠం వద్ద శరన్నవరాత్రులకు రాట పూజలు చేస్తున్న పీఠం ప్రతినిధులు

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయ దుర్గా పీఠంలో 54వ శరన్నవరాత్ర ఉత్సవాలకు రాట ముహూర్తపు పూజలు బుధవారం నిర్వహించారు. ఏటా పీఠంలో శరన్నవరాత్రులను ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఈ నెల 22 నుంచి ప్రారంభం కానున్న శరన్నవరాత్రులకు వేద పండితులు చీమలకొండ వీరావధాని ఆధ్వర్యంలో పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం (గాడ్) కుమార్తె గాదె సత్యవెంకటకామేశ్వరి, భాస్కరనారాయణ దంపతులు పూజలకు శ్రీకారం చుట్టారు. ఉదయం 9.46 గంటలకు వినాయకపూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం తదితర పూజలు చేశారు. అనంతరం పందిరి రాట వేసి ఉత్సవ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, విజయదుర్గా కళాశాల కరస్పాండెంట్ పెద్దపాటి సత్యకనకదుర్గ, పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన టీఓటీల శిక్షణ

సర్టిఫికెట్లు అందజేసిన వైస్ ప్రిన్సిపాల్



శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేసిన వైస్ ప్రిన్సిపాల్, ఫ్యాకల్టీలు

సామర్లకోట: పేదరికం నిర్మూలనకు గ్రామ స్థాయిలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ మేరకు ఉత్సాహవంతులైన పంచాయతీ కార్యదర్శులను టీఓటీలుగా ఎంపిక చేసి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై మూడు రోజుల పాటు శిక్షణ ఇచ్చామని విస్తరణ శిక్షణా కేంద్రం వైస్ ప్రిన్సిపల్ జి.రమణ అన్నారు. శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకు ఉన్న 11 జిల్లాలోని టీఓటీల శిక్షణ ముగింపు కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొన్నారు. మూడు రోజుల పాటు నేర్చుకున్న అంశాలపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ఆకలి బాధలను నిర్మూలించడం, ఆరోగ్య సంరక్షణ-జీవన ప్రమాణాల పెంపు, అందరికీ తాగునీటి వసతి కల్పించడం-పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం, ఉపాధి-ఆర్థికాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారని వైస్ ప్రిన్సిపాల్ తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలపై మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇవ్వవలసి ఉంటుందన్నారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు అమలు చేయడం ద్వారా పేదరిక నిర్మూలన జరుగుతుందని చెప్పారు. ఈ మేరకు ఆయా గ్రామాలకు కావసిన నిధులను కేంద్ర ప్రభుత్వం నేరుగా పంచాయతీలకు అందజేస్తుందని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీలు కె.సుశీల, కేఆర్ నీహారిక, ఎస్ఎస్ శర్మ, శ్రీనివాసరావు, ఎం.చక్రఫణిరావు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా డీఐజీగా జానకీదేవి బాధ్యతల స్వీకరణ



కాకినాడ లీగల్: ప్రస్తుత రిజిస్ట్రేషన్ విధానంలో క్రయ విక్రయదారులకు ఓటీపీ రావడం ద్వారా రిజిస్ట్రేషన్‌లో అక్రమాలు జరగవని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (డీఐజీ)గా సీహెచ్ జానకీదేవి అన్నారు. డీఐజీగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్‌లో సాంకేతిక లోపాలు వల్ల ఇబ్బందులు త్వరలోనే పరిష్కారమవుతాయన్నారు. ప్రస్తుతం ఆస్తి రిజిస్ట్రేషన్ చేసుకున్నప్పుడు క్రయ విక్రయదారుల ఆధార్‌కు ఓటీపీ వచ్చిన తర్వాత ఆస్తి వివరాలు స్వయంగా నమోదు చేయడం ద్వారా ఎటువంటి తప్పులు జరగవన్నారు. అలాగే రిజిస్ట్రేషన్ శాఖలో ఎటువంటి లోపాలు లేకుండా వేగవంతంగా క్రయవిక్రయదారులకు రిజిస్ట్రేషన్లు సక్రమంగా జరిగే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. డీఐజీగా జానకీదేవి బాధ్యతలు స్వీకరించిన అనంతరం మర్యాదపూర్వకంగా కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ జేఎస్‌యూ జయలక్ష్మి, తూర్పుగోదావరి జిల్లా రిజిస్ట్రార్ రెడ్డి సత్యనారాయణ, కోనసీమ రిజిస్ట్రార్ సీహెచ్ నాగలింగేశ్వరరావు తదితరులు కలిశారు.

రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌కు 86 మంది హాజరు



షార్ట్ లిస్టుని పరిశీలిస్తున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ విద్యార్థులకు డాక్టర్ రెడ్డీస్ బుధవారం నిర్వహించిన రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌కి 86 మంది విద్యార్థులు హాజరు కాగా రాత పరీక్ష నిర్వహించిన 54 మందిని షార్ట్ లిస్ట్ చేశారు. ఇంటర్వ్యూలు నిర్వహించిన అనంతరం వీరిలో సంస్థకు అవసరమైన వారిని ఎంపిక చేసి, ఉద్యోగాలు ఇస్తామని వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. 2024-25లో బీఎస్సీ, ఎంఎస్సీలో కెమిస్ట్రీ లేదా బయోటెక్నాలజీ పూర్తి చేసి, పదో తరగతి నుంచి 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈ రిక్రూట్‌మెంట్‌కి హాజరయ్యారన్నారు. ఉద్యోగాలకు ఎంపికైతే బీఎస్సీ వారికి రూ.2.10 లక్షలు, ఎంఎస్సీ వారికి రూ.2.60 లక్షలు వార్షిక వేతనంగా చెల్లిస్తారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఐస్ ఫ్యాక్టరీలో అమ్మోనియా గ్యాస్ లీక్

గ్యాస్ సరఫరా నిలిపివేత, తప్పిన ప్రమాదం



అమ్మోనియా గ్యాస్ లీకైన ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న అధికారుల బృందం

తాళ్లరేవు: స్థానిక గమిని ఐస్ ఫ్యాక్టరీలో మంగళవారం రాత్రి అమ్మోనియా గ్యాస్ పైపులైన్ లీకైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. దీంతో ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులు, స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అయితే ఫ్యాక్టరీ సిబ్బంది తక్షణమే స్పందించి గ్యాస్ సరఫరాను నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. అగ్నిమాపక శాఖ, పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. కాగా ఈ ఘటనపై సమాచారం తెలుసుకున్న భూగర్భజల శాఖ అసిస్టెంట్ హైడ్రో జియాలజిస్ట్ ప్రసన్న, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వెంకటేశ్వరరావు, కాలుష్య నియంత్రణ మండలి ఏఈ రామచంద్రమూర్తి, డిప్యూటీ తహసీల్దార్ టి.సూరిబాబు, వీఆర్వోలు, పంచాయతీ సిబ్బంది ఫ్యాక్టరీని బుధవారం సందర్శించి పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా భద్రతా ప్రమాణాలు పాటించాలని యాజమాన్యాన్ని హెచ్చరించారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఐస్ ఫ్యాక్టరీని నిర్వహిస్తున్నారని తెలిపారు. అనుమతులు తీసుకునేవరకు ఉత్పత్తి నిలిపివేయాలని ఆదేశించారు. ఇదిలా ఉండగా అనుమతులు లేకుండా నడుపుతున్న ఐస్ ఫ్యాక్టరీని సీజ్ చేయాలని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అదృష్టవశాత్తూ ఎవరికీ ఏమి కాలేదని ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని వారు ప్రశ్నించారు. ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

జీజీయూలో 'లిటిల్ హార్ట్స్' బృందం సందడి



ఇంజనీరింగ్ విద్యార్థులతో హీరో మౌళి

రాజానగరం: స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లో 'లిటిల్ హార్ట్స్' చిత్ర బృందం బుధవారం సందడి చేసింది. చిత్ర ప్రమోషన్‌లో భాగంగా ఇక్కడకు వచ్చిన హీరో మౌళి, నటుడు జయకృష్ణ, తదితరులు యూనివర్సిటీ క్యాంపస్‌లోని విద్యార్థులతో మమేకమయ్యారు. సినిమాలో ప్రత్యేకతను వివరిస్తూ, డైలాగ్‌లతో కేరింతలు కొట్టించారు. సెల్ఫీలు తీసుకుంటూ జోష్ పుట్టించారు.

వాడపల్లి వెంకన్నకు రూ.1.49 కోట్ల ఆదాయం



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది, సేవకులు

కొత్తపేట: ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ, భూ సమేత వెంకటేశ్వరస్వామి వారి హుండీల ద్వారా రూ.1,49,21,278 ఆదాయం వచ్చినట్టు దేవదాయ ధర్మదాయశాఖ డిప్యూటీ కమిషనర్ అండ్ ఈఓ నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు. బుధవారం ఆలయంలోని హుండీలను 27 రోజుల అనంతరం దేవదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో తెరచి ఆదాయాన్ని వసంత మండపంలో లెక్కించారు. ప్రధాన హుండీల ద్వారా రూ.1,15,09,966, అన్నప్రసాదం హుండీల ద్వారా రూ.34,11,312తో మొత్తం రూ.1,49,21,278 ఆదాయం వచ్చినట్టు తెలిపారు. అలాగే 28 గ్రాముల బంగారం, రెండు కేజీల 180 గ్రాముల వెండి, కానుకలుగా వచ్చాయన్నారు. నాలుగు దేశాలకు చెందిన 45 విదేశీ కరెన్సీ నోట్లు లభించాయన్నారు. హుండీ లెక్కింపుకు పర్యవేక్షణాధికారిగా అమలాపురం దేవదాయశాఖ అధికారి, ఏసీ సత్యనారాయణ వ్యవహరించారు. దేవదాయ ఇన్‌స్పెక్టర్ టీవీఎస్ఆర్ ప్రసాద్, వెలిచేరు గ్రూపు దేవాలయాల ఈఓ ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 10 నుంచి బ్రహ్మోత్సవాలు

కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి వెంకటేశ్వస్వామివారి బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 10వ తేదీ నుంచి జరగనున్నాయని డీసీ అండ్ ఈఓ చక్రధరరావు తెలిపారు. ఆ మేరకు బుధవారం చక్రధరరావు ఆధ్వర్యంలో జరిగిన సమీక్షలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వాడపల్లి క్షేత్రం భక్తుల సౌకర్యాలను ఆయన పరిశీలించారు.

రాష్ట్ర స్థాయి హాకీ, జిమ్నాస్టిక్స్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్స్, హాకీ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం మూర్తి తదితరులు



కాకినాడలో జరిగిన వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైన విజేతలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): సర్వేపల్లి రాధాకృష్ణన్ మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాల విద్యార్థులు డీఎస్ఏలో జరుగుతున్న ఎస్‌జీఎఫ్ఐ జిల్లా స్థాయి జిమ్నాస్టిక్స్, హాకీలో ప్రతిభను కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీవీవీఎస్ఎన్ మూర్తి బుధవారం తెలిపారు. జిమ్నాస్టిక్స్ అండర్-14 బాలికల విభాగంలో పి.సంజన, జె.జ్వాలరాజేశ్వరి, అండర్-14 బాలుర విభాగంలో బి.పవన్, సీహెచ్ రాజు, అండర్-17 బాలుర విభాగంలో గోపాల్‌సాయి, బాలికల విభాగంలో బి.కుసుమ, నాగ నందిని, అండర్-19 హాకీలో జి.స్వరూప్ రాష్ట్ర స్థాయి పోటీలు ఎంపికయ్యారన్నారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పీడీలు వర ప్రసాద్, బి.శ్రీను, ఎంపికైన క్రీడాకారులను ఉపాధ్యాయులు రత్నప్రసాద్, విద్యార్థులు అభినందించారు.



తనూజ్

మలికిపురం: ఈ నెల 16న కాకినాడ స్టేడియంలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి జిమ్నాస్టిక్స్ పోటీల్లో గుడిమెళ్లంక ఉన్నత పాఠశాల విద్యార్థి కోసెట్టి తనూజ్ విశేష ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. అక్టోబర్‌లో కాకినాడ క్రీడా మైదానంలో జరిగే రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్స్ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తరపున తనూజ్ పాల్గొంటాడని హెచ్ఎం కె.రామకృష్ణ తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి జిల్లా వెయిట్‌లిఫ్టర్లు

కాకినాడ క్రైం: అండర్-19 రాష్ట్ర స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు ఉమ్మడి జిల్లాకు చెందిన 19 మంది వెయిట్‌లిఫ్టర్లు ఎంపికయ్యారు. కాకినాడలోని క్రీడా ప్రాంగణంలో బుధవారం కోచ్ సతీష్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో 60 మందిలో 19 మంది ఎంపికయ్యారు. జయసూర్య, ఎ.రాహుల్, ఐ.మణికంఠ, డి.కారుణ్యముఖేష్, బి.రిషబ్, కె.సాయిదుర్గాప్రసాద్, జి.సుబ్రహ్మణ్యం, ఎ.సహస్ర, బి.ఇందిరా ప్రియాంక, హాసిని, మాధురి, సీహెచ్ శ్రీసాధ్విక, ఎండీ రహం, నిషాతో పాటు అండర్-17లో ఎం.దుర్గాప్రసాద్, సీహెచ్ సంతోష్‌కుమార్, బి.గాయత్రి, ఎం.నవ్యశ్రీ ఉన్నారు.

దేవస్థానం మాజీ చైర్మన్ మృతి



రామకృష్ణ (ఫైల్)

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నేత నగరం గ్రామానికి చెందిన చిట్టూరి రామకృష్ణ (60) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఆయన గతంలో అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం చైర్మన్‌గా, మామిడికుదురు సొసైటీ అధ్యక్షుడిగా పని చేశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, పి.గన్నవరం నియోజకవర్గ ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు సంతాపం తెలిపారు. రామకృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్త కొబ్బరి (క్వింటాల్)	20,000 – 21,500
కొత్త కొబ్బరి (రెండో రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	31,500
గటగట (వెయ్యి)	30,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	30,000
గటగట (వెయ్యి)	28,500
నీటికాయ	
పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	5,250
కిలో	350

ఉత్సాహంగా టీటీ ఎంపికలు



టీటీ హాల్‌లో ఎంపికలు ప్రారంభిస్తున్న శ్రీనివాస్ కుమార్ తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటి): విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని అలవరచుకుని క్రీడల్లో రాణించాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్ కుమార్ తెలిపారు. బుధవారం డీఎస్ఏ టీటీ(టేబుల్ టెన్నిస్) హాల్‌లో పాఠశాల క్రీడాసమాఖ్య అండర్-14, 17 బాలబాలికల ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికల ప్రారంభ కార్యక్రమానికి ఎస్‌జీఎఫ్ఐ అండర్-14, 17 కార్యదర్శి కె.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ టీటీ చాలా వేగవంతమైన క్రీడ అన్నారు. ఎంతో ఏకాగ్రత ఉంటేనే గాని టీటీలో రాణించలేమన్నారు. టీటీలో రాణించి జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు. సమాఖ్య కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి టీటీ పోటీలకు జిల్లా జట్లు ఎంపిక చేస్తున్నామన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి పరిధిలో 120 మంది బాలబాలికలు ఎంపికలకు హాజరయ్యారు. అనంతరం టీటీ ఆడి డీఎస్‌డీఓ శ్రీనివాస్‌కుమార్ ఎంపికలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఒలింపిక్ సంఘ నిర్వహణ కార్యదర్శి రవిరాజు, పీడీలు పాల్గొన్నారు. ఎంపికలను ఎస్‌జీఎఫ్ఐ అండర్-14, 17 మహిళా కార్యదర్శి సుధారాణి పర్యవేక్షించారు.

కక్షతోనే హత్యాయత్నం



అరెస్టు చేసిన నిందితుడితో పోలీసులు

కాకినాడ రూరల్: రమణయ్యపేట గ్రామ పరిధిలో సర్పవరం జంక్షన్ వద్ద పోలీసుస్టేషన్ ఎదురుగా ఉన్న గోపికృష్ణ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో సీ-4 ఫ్లాట్‌లో డీజిల్ పోసి నిప్పు పెట్టిన సంఘటనలో నిందితుడు పెంట్ హౌస్‌లో ఉండే పొన్నగంటి రవిచంద్రకుమార్ (రవి)ని బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. సర్పవరం ఎస్సై శ్రీనివాస్‌కుమార్ వివరాల ప్రకారం నిందితుడు వ్యక్తిగత కక్షతోనే 14న అర్ధరాత్రి సీ-4 ఫ్లాట్‌లో నివాసం ఉంటున్న పిల్లి సత్తిబాబుపై హత్యాయత్నం చేసేందుకు ఫ్లాట్ హాలులో డీజిల్ పోసి నిప్పు పెట్టాడని ఎస్సై తెలిపారు. అదృష్టవశాత్తూ ఎవరికి ఏ హానీ జరగలేదని, అయితే హాలులో ఫర్నిచర్ పూర్తిగా దగ్ధమయిందన్నారు.